# రెండు ముఖాలు

## ఒకటి

అదుగోనండీ, బయలుదేరాడు మహానుభావుడు.

ఆజానులాల్చీ, కళ్ళజోడు, చేతిలో కొత్త పుస్తకం, గజంగుడ్డ వేస్టు! ఎందుకంత పొడుగు చొక్కా? ఏదో 'కాన్స్పిక్యుయస్'గా ఉండాలి. అంతే 'హిగింబాదమ్సు' చల్లగా ఉండాలిగాని కొత్తపుస్తకాలకేం లోటు? చదివేదిలేదు, అర్థమయేదీలేదు.

వట్టి పోజులు!

రష్యన్ కథలంటాడు. ఫ్రెంచి నవలలంటాడు. ఇంగ్లీషు కవిత్వం అంటాడు. జర్మన్ విమర్శలంటాడు. ఎందుకా ఘోషలన్నీ? నోరుమూసుకు పడివుండక. మనలా నేలమీద నడవడే! ఎంతసేపు ఆకాశ విహారం! మన దగ్గరికి రాడు, మాటాడడు. పురుగుల్ని చూసి నట్టు చూస్తాడు.

ఏడిశాడు - మన దగ్గర నోరుపెగలద్దూ? అక్కడా అక్కడా నోటి తడాఖాలు కొట్టినట్టు కాదు. మనతో ప్రసంగించడమంటే - అగ్నిపరీక్ష! కత్తులమీద సాము!

కొండొకచో - మాట్లాడాడా, కవిత్వం, చమత్కారాలు, అఘోరిస్తాడు. సూటిగా... సాపుగా... ఈవూరి రాజకీయాలు మాట్లాడమను, చూద్దాం. కాశ్మీరు యుద్ధంమాట, కల కత్తా గొడవల మాట తర్వాత చూసుకోవచ్చు.

గజం కోటాగుడ్డ, పంపు పంచదార, ఒక బస్సు టికెట్టు సంపాదించమను తెలుస్తుంది వీడి కవిత్వం, ప్రగల్భాలూను.

ఎక్కడేనా సభ అంటూ తోరణం కట్ట భయం. మనవాడు సిద్ధం - ఎందుకూ? నోరు మూసుకుని ఊళ్ళో పడి వుండక. ఈమాత్రం అవాకులు, చెవాకులు మాట్లాడలేకనేనా మనం వెళ్ళకపోత? మనం ప్లాట్‌ఫారం ఎక్కితేనా.. ఎదట నిలబడగలిగిన మగాడేడీ? మన వాగ్ధోరణికీ, ఇచ్చే 'ఇన్‌ఫర్‌మేషన్'కీ 'పండితులు దారెత్తి పరుగుచ్చుకోవాలి' బసవరాజు అన్నట్టు -

అన్నట్టు - మనకి టైమెక్కడేడిసింది! ఈ ఊరినించి మనం ఒక్క గడియ కదిలితే.. ఈ గ్రామ ప్రజ యావత్తు ... హడలి... బెంగెట్టుకు చచ్చిపోతుంది. పాపం! ఎందుకీ నరహత్య అని మనం.. అనగా మనపీఠం ఈ ఊరినుంచి కదలదు. అంతే కాదుటోయ్ కారణం?

ఒకమాటు పరికించి చూశాం. పోనీ పాపం.. అని

ముఖం గమ్మత్తుగా పెట్టి నవ్వి వెళ్ళిపోయాడు.

ఓరి వీడినవ్వు నాశనంకాను! నవ్వడానిక్కూడా మన సెలవుండాలని ఈ పీనుక్కి తెలియదు గాబోలు! ఈ నవ్వు గడియలో ఏడుపులోకి దింపెయ్యగలం... బొత్తిగా ఏడ్చిపోతాడని ఊరుకున్నాం గాని...

ఇంతకూ... వీడు మనకు ఏమపకారం చేశాడూ అన్నది కాదు ప్రశ్న, వీడి ఆ ప్రత్యేకత ఏమిటీ... అని మా విచికిత్స.

మనలో మనమాట. మొన్న చచ్చేటంత దెబ్బతీశాం. సిగ్గులేదు గాని.

వార్షికోత్సవ మహాసభలో వేదికమీదికి వీడు వచ్చాడండీ తగుదునమ్మా! అని. అప్పుడు ఆడియన్సు సుఖంగా వింటున్నా సరే... నాలుగు మూలల నుంచీ 'దిగు దిగు' అని అరిచే ఏర్పాటు దిగ్విజయంగా చేశాం. ఊపిరాడనివ్వలేదు మానవుడికి...

వెంటనే ఉపన్యాసం అక్కడికే ముగించి, 'మీరు నా ప్రసంగం ఇంత శ్రద్ధగా విన్నందుకు కృతజ్ఞుణ్ణి' అని ఒక విసురు విసిరి దిగిపోయాడు. దానితో మరొకడైతే - మంచం పట్టవలసిందే. కాని వీడు దులిపేశాడు. చింత చచ్చినా పులుపు చావలేదు.

కవిగాళ్ళది చింతపండు జాతిగాబోలు! నయం, ఈ మాట వాడు వినలేదు. వింటే ఏమంటాడో తెలుసునా?

'ఈ రాగిచెంబు లోకాన్ని ఇంకెవరు బాగుచెయ్యగల'రని హ్యూమర్ అఘోరించేవాడు.

తల వంచుకుని రోడ్డుపక్క నడుస్తాడు. ఇది మనకు తలవంపులో, వాడికో... తేలింది కాదు. మనకేం ఖర్మం? వాడికేలెండి!

ఎన్ని అవసరాలొస్తే మాత్రం మనం ఎప్పుడేనా వంచి ఎరుగుదుమా! సందులంట

తిరుగుతాడేం? సర్కారు వేసిన రాచబాట వుండగా, అది పూర్తిగా మీకు వదిలిపెట్టానంటాడు గాబోలు! రాస్కెల్ –

వట్టి 'సినిక్'. ఒక్క స్నేహితుడు లేడు. ఒక పెద్దమనిషి, దగ్గరికి చేరనియ్యడు. కాఫీ హోటేల్లో, క్లబ్బుల్లో ఒక్కడూ పలకరించడు. పేకముక్కల పేర్లేనా చెప్పలేడు. కాని ఇన్ని ఉన్నా ఏమీ కించపడడే? సిగ్గులేదా? మనం ఉంచినదానికన్నా ఎక్కువ దూరంలో వుండి తృప్తిగా లోపల్లోపల నవ్వుకుని ... ఏ పుస్తకంలోనో కలిసిపోతాడు. ఆ నిర్లక్ష్యం చూస్తే అగ్గి ఎత్తుకొస్తుందా రాదా? నిజం చెప్పండి.

## రెండు

ఇక మొదలు... విరగబడి వింతగా నావేపు చూడడానికి. సర్కసు జంతువును, కొత్త ద్వీపంనుంచి వచ్చిన మనిషిని చూసినట్టు.

రెండేసి అవయవాలున్నాయా? తలకిందుగా నడుస్తున్నానా? నడిస్తే ఎంత బాగుండును. ఒక యువయోగి అని నాకు గుడిగట్టి డబ్బు చేసుకునేవారు పాపం – అందుకూ కొరగాని... కొరకరాని... కాని నోటితీటతీరా 'స్కాండల్సు' మాటాడుకోవడానికి మాత్రం తోడ్పడి ఉపకారం చేస్తూనే ఉన్నాడు. కాని... కసి? యుగయుగాలుగా మానవ జాతిలో నిలిచి సభ్యత మాటుపడినప్పుడల్లా... పైకి విశృంఖలంగా వచ్చే క్రూరమృగ లక్షణాలు కాంద్రుమని బయటికి రాకమానవు. చిరునవ్వుల్లో, పండు మీసాల్లో, ఎంతకాలం దాచగలరు? పాపం వాళ్లూ మనుష్యులు!!

"మనుష్యుల్ని చూసిన వికారం పోవడానికి ఒకక్షణం పచ్చని చెట్లవేపు చూడమ"న్నాట్ట, ఆస్కార్‌వైల్డు. అయితే చెట్లవేపే కాదు జంతువులవేపు చూసినా కొంత శాంతి చేకూరుతుంది.

మనుష్యులకన్న జంతువులు ఎంత నయం! నానాగడ్డూ మనుష్యులకు విడిచిపెట్టి... ఒక్క తృణం మాత్రం అవి తింటాయి. మాటమాటకూ మనిషి పెద్ద తెలివిగా 'పశువులా ప్రవర్తించకు' అంటాడు. పశువు వింటే ఏమనుకుంటుందో అన్న జ్ఞానం లేదు గదా! పశువు భాషే అర్థమయితే మానవుడు ఎంత సిగ్గుపడేవాడో!

ఏం మనిషి చేసిన పనులు నేనేం చేశాను?... ఒకరి భార్యల నపహరించడం, రాజ్యంకోసం అన్నదమ్ములు నరుక్కుచావడం, స్నేహం నటించి తడిగుడ్డలతో సాటివారి గొంతులు కొయ్యడం, జాతులనీ, మతాలనీ, గళ్లు గీసుకొని, గుళ్లు వేసుకొని, పరిధులు

ఏర్పరచుకొని దొంగ పరిరంభాల్లో, విషపు నవ్వుల్లో, లోలోన కుళ్లడం పశు చరిత్రలో చూపించగలవా?

మాకు న్యాయస్థానాలు, విశ్వవిద్యాలయాలు, విజ్ఞాన కేంద్రాలు లేవు కనుకనే మేం ఇప్పటికీ నిర్మలంగా బతుకుతున్నాం. ధైర్యం వుంటే మాతో రండి. ఆకుపచ్చని ప్రపంచం లో బతుకుదాం. లేదా - మీ ఇనుప పట్టణాల్లో, నాగరికత మేలి ముసుగుల్లో మూలుగుతూ కాలక్షేపం చెయ్యండి. మేమేం చెయ్యం? మీ దురదృష్టం అది" అని పశువు తిరగబడి తన భాషలో అంటే!

ఈ మానవజాతికి ఎంత దూరంగా వుండగలిగితే - అంత సంతోషిస్తాను. ఎందుకీ మర్యాదలు, చిరునవ్వులు, నమస్కారాలూ! వీటి ఏ ఒక్కటివెనకా మనిషి లేడు. ఆర్ద్రత లేని ఒక్క శుష్కభావం నిలిచి వుంది. వీటికి దూరంగా వుంటానన్నందుకేనా నామీద ద్వేషం? వీటి నిజం నేను తెలుసుకున్నాననేనా నన్నీ మానవులు వేటాడుతున్నది? - ఇవి నాకిచ్చినవాడు నానుంచి కూడా కోరుతున్నాడు. తీసుకోకా, ఇవ్వకా, దూరంగా వుండడ మేనా నా క్షమించరాని అపరాధం? - మానవుడు, ఒకడు ఒక సామ్రాజ్యం సంపాదించుకున్నా... లక్ష్యపెట్టకుండా ఊరుకుంటాడు గాని... ఇంకొకడు చూపే 'ఇండివిద్యువాలిటీ' మాత్రం చూసి సహించడు. ఇదీ జీవన రహస్యం!

ఈలోకం అంతా ఒక హోలీ పండుగలా వుంది. ఎర్రనీళ్లందరిచేతా పోయించుకోవాలి, నేనూ పొయ్యాలి, అప్పుడూ ఈ లోకం సంగీతానికి. నాకూ, శ్రుతి - సాయంత్రం క్లబ్బుకూ, రాత్రి కార్లికార్ సర్కసుకూ, ఉదయం గుళ్లో సప్తాహానికీ వచ్చి తనివితీరా పక్కవాడితో 'స్కాండల్సు' మాటాడితేనే, నా మనుగడ సార్థకం. అప్పుడే అందరికీ నేను మిత్రుణ్ణి.

Avoid papularity, It has many snares and no real benefit అన్నవాడు గట్టివాడు... ఇట్లా అని మనుష్యుల్ని ద్వేషించడమనడం లేదు. పాపం! ద్వేషించదగిన గొప్ప విలువలు మాత్రం ఏమున్నాయి వీళ్ళదగ్గర? వీరిలోని ఏ సిద్ధాంతాన్ని ద్వేషించడం? ఏ నిశ్చయాన్ని ప్రతిఘటించడం? వట్టి కాలవాదులు.... లోపలికి చూసుకుంటే తమదీ అన్నది ఏదీ వీరికుండదు. అట్లా ఏదో ప్రత్యేకత ఉన్నదనేగా నామీద విషం వీరికి -

ఇంతకన్నా 'అన్‌పాప్యులర్' అయి పలకరించేవాడు లేకపోతే ఎన్ని పుస్తకాలు చదువుకోవడానికి వీలయ్యేదో!

అంతర్ముఖుడికి రెండేరెండు పరమప్రియమైనవి గాబోలు! ఒకటి - తమ

శాంతశీతలచ్ఛాయల్ని విరజిమ్మ ఆదరించే అరణ్యసీమలూ, రెండు - ఊహాతీత దివ్యప్రపంచంలో తిప్పి నిరంతర మంగళగానాన్ని వినిపించే మహాకవి కావ్యమూను.

## హృదయం

రెండు కంఠాల్నీ ఏకం చెయ్యడానికి ఎంత ప్రయత్నించాను? విఫలమయిపోయింది. నాలో ఏదో భాగం చెడిపోయింది.

•••

విశాలమైన మహాభవనంలో కూర్చున్నాను. శరీరం లేని మూడు ధ్వనులు వినబడ్డాయి. చెప్పలేనంత భయంవేసింది. అవతల ఏమున్నదో ఆనకా... అర్థమేమయి నదీ తెలియకా..

•••